● జగన్ దిష్టిబొమ్మ దహనం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రం చేశారనే ఆరోపణలతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను మోపిదేవిలో కూటమి నేతలు ఆదివారం దహనం చేశారు. హిందువుల మనోభావాలు కాపాడాలి, బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు.



మచిలీపట్నం వైసీపీలో ముసలం

ఇద్దరు సీనియర్ నాయకులు గుడ్‌బై



మాట్లాడుతున్న వాలిశెట్టి రవిశంకర్, శ్రీకాకుళపు నాగేశ్వరరావు

- తాళ్లపాలెం పంచాయతీ పాలకవర్గ సభ్యులు తొమ్మిది మంది రాజీనామా
- వైసీపీని వీడిన 200 కుటుంబాలు
- అదేబాటలో పలువురు సీనియర్ నాయకులు
- పార్టీ మారేందుకు 20 మంది కార్పొరేటర్లు రెడీ
- మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన కుమారుడు కిట్టు వ్యవహార శైలి నచ్చకే రాజీనామాలు

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం వైసీపీలో ముసలం మొదలైంది. మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన కుమారుడు కిట్టు వ్యవహారశైలితో మనస్తాపానికి గురైన సీనియర్ నేతలు పార్టీని వీడుతున్నారు. మచిలీపట్నం మండలానికి చెందిన వైసీపీ క్లస్టర్ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, జిల్లా వ్యవసాయ సలహామండలి డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీకాకుళపు నాగేశ్వరరావు (బాబు), వారి అనుచరులు, తాళ్లపాలెం పంచాయతీ పాలకవర్గ సభ్యులు తొమ్మిది మంది వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాళ్లపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నానికి పంపిన రాజీనామా లేఖలను వారు చూపించారు. వీరితో పాటు పంచాయతీలోని మరో 200 కుటుంబాల వారు వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించారు.

-ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

సీనియర్ నేతలకు ఎదురైన అవమానాలు

మచిలీపట్నం మండలానికి చెందిన వాలిశెట్టి రవిశంకర్, శ్రీకాకుళపు నాగేశ్వరరావు(బాబు) 30 ఏళ్లకుపైగా రాజకీయాల్లో ఉన్నారు. తొలుత కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత వైసీపీలో కీలక నాయకులుగా వ్యవహరిస్తున్నారు. పేర్ని నాని మంత్రి అయ్యాక తాళ్లపాలెం, పెదపట్నం, గోకవరం, కానూరు తదితర గ్రామాల నాయకులను పట్టించుకోలేదు. పేర్ని నాని కుమారుడు పేర్ని కిట్టు గత ఐదేళ్లు ఎమ్మెల్యే మాదిరిగా పెత్తనం చలాయించారు. సీనియర్ నాయకులు కిట్టు వద్దకు వెళ్లేందుకు ఇష్టపడలేదు. పేర్ని నాని వద్దకు ప్రజా సమస్యలు చెప్పుకునేందుకు వెళితే మండల స్థాయిలో లంకే వెంకటేశ్వరరావును కలవాలని చెప్పి సీనియర్ నాయకులను అవమానించారు. పలు మార్లు అవమానాలకు గురిచేసేలా వ్యవహరించారు.

రెండు నెలల కిందటే పార్టీ వీడేందుకు సిద్ధం

వాలిశెట్టి రవిశంకర్ తన అనుచరులతో కలిసి వైసీపీకి రాజీనామా చేసేందుకు రెండు నెలల క్రితం సమావేశమయ్యారు. విషయం తెలిసి నాని తన కుమారుడు పేర్ని కిట్టును అక్కడకు పంపారు. వైసీపీలో తమకు ఎదురైన చేదు అనుభవాలు, అవమానాలను కార్యకర్తలు, నాయకులు ఏకరువ పెట్టి తాము పార్టీని వీడతామని అప్పట్లో చెప్పకనే చెప్పారు. గోకవరం పంచాయతీలో కర్నూలు, అనంతపురం తదితర జిల్లాల నుంచి వచ్చిన రెడ్డి సామాజికవర్గం వారు ఉంటారు. పేర్ని కుటుంబం పనితీరు నచ్చక కీలక నాయకులంతా వైసీపీని వీడేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మేకావానిపాలెం, పోతిరెడ్డిపాలెంలోని నాయకులు సైతం రెండు రోజుల్లో తమ రాజీనామాలను సమర్పిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

నాయకులను దూరం పెట్టడంతోనే..

గత ఐదేళ్లు నాయకులను దూరం పెట్టడం.. ఉంటే ఉంటారు పోతే పోతారు అంటూ పేర్ని నాని తరచూ చేస్తున్న వ్యాఖ్యలు నాయకులను తీవ్ర మనస్తాపానికి గురిచేశాయి. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్న వల్లభనేని బాలశౌరిని నియోజకవర్గంలో తిరగనీయకుండా అడ్డుకోవడం, ఎంపీ వద్దకు ఎవరైనా వెళితే వారిని ఎంపీ వర్గీయులుగా ముద్రవేసి ఇబ్బందులు పెట్టడం వైసీపీలో నివురుగప్పిన నిప్పులా మారింది. పేర్నినాని, కిట్టు వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్న సీనియర్ నాయకులు ముందు వైసీపీని వీడీ తర్వాత ఏ పార్టీలో చేరాలనేది నిర్ణయించుకుంటామని చెప్పడం గమనార్హం.

మచిలీపట్నం నగర కార్పొరేటర్లలో అసంతృప్తి

మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్‌లు ఉండగా 45 మంది వైసీపీ, నలుగురు టీడీపీ, ఒకరు జనసేన తరఫున కార్పొరేటర్లుగా ఉన్నారు. పేర్ని నాని, కిట్టు పనితీరుపై ఆగ్రహంగా ఉన్న వైసీపీకి చెందిన 20 మందికి పైగా కార్పొరేటర్లు ఇటీవల సర్కారుతోటలో వైసీపీకి చెందిన ఒక కీలక నాయకుడి ఇంట్లో సమావేశమయ్యారు. 20 మంది కార్పొరేటర్లు వైసీపీలో ఎందుకు కొనసాగాలో చెప్పాలని, పార్టీలో తమకు ఎదురైన అవమానాలను చెప్పి బయటకు వచ్చేసినట్లు సమాచారం. వీరు పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

జిల్లా అధికారులకు స్థానచలనం

- కృష్ణాజిల్లా డీపీవోగా అరుణ
- జెడ్పీ సీఈవోగా కన్నమ్మనాయుడు రాక



జె. అరుణ

మచిలీపట్నం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లా స్థాయి అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణాజిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా జె.అరుణ నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న నాగేశ్వర నాయక్‌ను చిత్తూరు జిల్లా డీపీవోగా బదిలీ చేస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలం నుంచి ఖాళీగా ఉన్న కృష్ణా జెడ్పీ సీఈవో పోస్టును నెల్లూరు జిల్లా జెడ్పీ సీఈవో కె.కన్నమ్మనాయుడుతో భర్తీ చేశారు. ప్రస్తుతం కృష్ణా జెడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా ఉన్న పి.ఆనంద్‌కుమార్‌ను డిప్యూటీ సీఈవోగా కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా సెర్ప్ కార్యాలయంలో డైరెక్టర్‌గా పనిచేస్తున్న పసుపుల లావణ్యకుమారిని నియమించారు. ఎన్టీఆర్ జిల్లా డీపీవో కార్యాలయంలో డీఎల్‌డీవోగా పనిచేస్తున్న ఎ.అనురాధ ఏలూరు జిల్లా డీపీవోగా బదిలీ అయ్యారు.

డ్వామా పీడీలు వీరే..


కృష్ణాజిల్లా డ్వామా పీడీగా ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా పని చేస్తున్న ఎస్.వి.శివప్రసాద్ యాదవ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు డ్వామా పీడీగా పనిచేస్తున్న జి.వి.సూర్యనారాయణను ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీగా ఎ.రామును నియమించారు. ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీగా పనిచేస్తున్న జె.సునీతను సీపీఆర్అండ్ఆర్‌డీ జాయింట్ కమిషనర్‌గా నియమించారు

అటవీశాఖ అధికారిగా సునీత

కృష్ణాజిల్లా అటవీశాఖ అధికారిగా పి.సునీత నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె ప్రకాశం జిల్లా అటవీశాఖ డిప్యూటీ కన్జర్వేటర్‌గా పనిచేస్తున్నారు. ఆమెను కృష్ణాజిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంతరాము ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా డిప్యూటీ కన్జర్వేటర్‌గా పనిచేస్తున్న కె.రాజశేఖరరావును ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.

ఎక్సైజ్‌లో బదిలీల పైరవీలు

ఉమ్మడి కృష్ణాజిల్లాకు భారీగా డిమాండ్



మొన్నటి వరకు ఎక్సైజ్ శాఖది ఒక దారి. ఎస్ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో)ది మరో దారి. అయితే ఈ రెండింటికి మధ్య ఉన్న గీత ఇప్పుడు చెరిగిపోయింది. ఎస్ఈబీని రద్దు చేసిన ప్రభుత్వం అందులోని సిబ్బందిని ఎక్సైజ్ శాఖకు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఎక్సైజ్ శాఖలో బదిలీలకు జోరుగా పైరవీలు సాగుతున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు ఉన్న స్థానాలను పదిలం చేసుకునే పనిలో పడ్డారు. కోరుకున్న స్థానాల్లో కూర్చోవడానికి కొత్త వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇప్పటికే కొందరు సిఫార్సు లేఖలను సైతం చేజిక్కించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన వారికి సైతం సిఫార్సు లేఖలు ఇవ్వడం ఇప్పుడు జిల్లాలోని ఎక్సైజ్ శాఖలో పెనుదుమారం రేపుతోంది.

ప్రస్తుత స్థానం కాపాడుకునే పనిలో కొందరు..

- జిల్లాకు రావడానికి మరికొందరి ప్రయత్నం
- కూటమి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- ఇప్పటికే పలువురికి అందిన సిఫార్సు లేఖలు
- వైసీపీతో అంటకాగిన వారికి ఇవ్వడంపై విమర్శలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఈబీని రద్దు చేయడంతో అందులో ఉన్న సిబ్బందిని అధికారులు రిలీవ్ చేశారు. వాళ్లంతా ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నారు. ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియ త్వరలో ప్రారంభం కాబోతుంది. దీని కోసం ఇప్పటి నుంచే అధికారులు స్థానాలను ఎంచుకునే పనిలో పడ్డారు. ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీబిజీగా ఉన్నారు.

ఎవరి పట్టు వారిది..!

ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే కొనసాగాలని కొందరు అధికారులు చూస్తున్నారు. ఆ స్థానాలను పదిల పరచుకునే పనిలో ఉన్నారు. వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖను ఒకరకంగా ఏలిన అధికారులంతా ఇప్పుడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో అడుగు పెట్టడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.

పోస్టులు ఇవే..

ఎస్ఈబీని రద్దు చేసి ఎక్సైజ్‌లో విలీనం చేసిన తర్వాత ప్రభుత్వం పోస్టుల వివరాలను ప్రకటించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు ఒక డిప్యూటీ కమిషనర్, ఒక అసిస్టెంట్ కమిషనర్ ఉంటారు. వీరు కాకుండా మచిలీపట్నం కేంద్రం ఒక ఎక్సైజ్ సూపరింటెండెంట్, విజయవాడ కేంద్రంగా ఒక ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉంటారు. అలాగే ఉమ్మడి జిల్లాలో మూడు ఎక్సైజ్ డిపోలు ఉన్నాయి. గుడివాడ, నిడమానూరు, గొల్లపూడిలో ఈ డిపోలు ఉన్నాయి. ఇక్కడి నుంచి మద్యం దుకాణాలు, బార్‌లకు సరుకు సరఫరా అవుతుంది. ఈ డిపోలు ఒక్కోదానికి ఒక్కో ఈఎస్ ఉంటారు. డీసీ, ఏసీ పోస్టులు రెండూ విజయవాడ కేంద్రంగా ఉండబోతున్నాయి. దీంతో ఈ రెండు పోస్టులకు గట్టి పోటీ ఉంది.

ప్రయత్నాలు ముమ్మరం

- ఎస్ఈబీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పదోన్నతిపై డీసీగా రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి ఈనెలాఖరు వరకు ఎక్సైజ్ శాఖలో బదిలీలు పూర్తి చేసుకోవడానికి గడువు ఉంది. ఒకవేళ పదోన్నతి రావడం ఆలస్యమైతే ఏసీగా విజయవాడలో చేరి డీసీ పోస్టు ఇన్‌చార్జి తీసుకునే ప్రయత్నం జరుగుతున్నట్టు తెలుస్తోంది.
- ప్రస్తుతం ఎస్ఈబీ డీసీగా శంకరయ్య ఉన్నారు. ఎస్ఈబీ రద్దుతో ఆయన వీఆర్‌లో ఉన్నారు. ఆయన ఇప్పుడు ఎక్సైజ్ డీసీ పోస్టుపై ఆసక్తిని చూపిస్తున్నట్టు తెలిసింది.
- ఇంతకు ముందు మచిలీపట్నం ఈఎస్‌గా పనిచేసిన కృష్ణకుమారి ప్రస్తుతం విశాఖపట్నంలో పనిచేస్తున్నారు. ఆమె తిరిగి మచిలీపట్నం ఈఎస్‌గా గానీ, విజయవాడ ఈఎస్‌గా గానీ రావడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆమెకు ఇద్దరు కూటమి ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు ఇచ్చారు. ఆమె మచిలీపట్నంలో పనిచేసినప్పుడు బార్ యజమానులను వేధించారన్న ఆరోపణలు ఉన్నాయి.
- వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు నారాయణస్వామి, గుడివాడ అమరనాథ్ వద్ద ఓఎస్డీగా పనిచేసిన మధు ఉమ్మడి కృష్ణా జిల్లాలో రెండు ఈఎస్ పోస్టుల్లో ఒక్కదాన్ని ఆశిస్తున్నారు. ఆయనకు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఒక మంత్రి లేఖ ఇచ్చారు. దీనిపై కూటమి ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నాటి ప్రభుత్వ హయాంలో మంత్రుల అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరించిన వ్యక్తికి ఎలా లేఖ ఇచ్చారని ఆ మంత్రిని ప్రశ్నించినట్టు తెలిసింది.

సామాజిక వర్గాల బేరీజుతో సర్దుబాటు!

సామాజిక వర్గాలను బేరీజు వేసుకుని బదిలీల్లో స్థానాలు కేటాయించే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈఎస్ పోస్టుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్న కృష్ణ కుమారి, మధులను రెండు చోట్ల సర్దుబాటు చేస్తారని విశ్వసనీయంగా తెలిసింది. ఒకరిని డిపో ఈఎస్‌గా పంపి, మరొకరికి విజయవాడలో గానీ, మచిలీపట్నంలో గానీ పోస్టింగ్ ఇవ్వాలన్న విధంగా సర్దుబాటు చర్చ నడుస్తున్నట్టు సమాచారం.



పాడైన మోనోబ్లాక్ మోటారు

మోటారుకు పట్టిన బురదను కడుగుతున్న మెకానిక్

అన్నదాతపై మరో భారం

పొలాల్లో మోటార్లను చుట్టేసిన వరదల బురద

- వైండింగ్ చేసేందుకు రూ.6 వేలు ఖర్చు
- స్టార్టర్ బోర్డు కొనాలంటే రూ.5వేలు అవసరం

తోట్లవల్లూరు, సెప్టెంబరు 22 : కృష్ణానది వరదలకు పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయి రూ.లక్షల్లో నష్టపోయిన లంక గ్రామాల రైతులపై కొత్తగా మోటార్ల భారం పడింది. ఎనిమిది లంకల్లో వేల సంఖ్యలో వ్యవసాయ మోటార్లున్నాయి. 50 శాతం మంది రైతులు సబ్‌మెర్సిబుల్ మోటార్లు వేశారు. ఆ మోటార్లకు వరదతో నష్టం జరగకున్నా స్టార్టర్ బోర్డు నీట మునిగి పాడయింది. ఈ బోర్డు కొత్తది కొనాలంటే రూ.5 వేలు అవసరం. రిపేరు చేయించాలన్నా రూ. 2 వేలు ఖర్చవుతోందని రైతులంటున్నారు. పది అడుగుల లోతున వరల్లో అమర్చిన మోనోబ్లాక్ మోటార్లు 50 శాతం ఉన్నాయి. ఇవి మొత్తం ఒండ్రు మట్టితో పూడుకుపోయాయి. వాటిని బయటకు తీసి బురద కడిగి వైండింగ్ చేయించేందుకు రూ.6 వేల వరకు ఖర్చవుతోందని రైతులు తెలిపారు. ఇలా రూ.11 వేల వరకు మోటారు బాగు చేయించేందుకు ఖర్చు అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మోటార్లకు కూడా సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తోట్లవల్లూరు లంకలో వరద మట్టితో పూడిన మోటారు



దుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్

దుర్గమ్మ సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్ : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఇ.వేణుగోపాల్, కుటుంబస భ్యులతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానం తరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.



దుర్గగుడి గోపుర స్వర్ణతాపడానికి విరాళం ఇస్తున్న భక్తులు

దుర్గగుడి గోపుర స్వర్ణ తాపడానికి విరాళాలు

వన్‌టౌన్: దుర్గగుడి ఆలయగోపురం స్వర్ణతాపడ పనుల నిమిత్తం గుంటూరు సంగడిగుంట రెడ్లబజారుకు చెందిన పేరం శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు విరాళం అందజేశారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన వారు 1,01,116లను చెక్కురూపంలో ఈవో రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు. అలాగే గొల్లపూడి ప్రాంతానికి చెందిన రాఘవేంద్ర బ్రోకర్స్ యాజమాన్యం రూ.1,01,116ల విరాళాన్ని చెక్కురూపంలో ఏఈవో ఎస్.రమేష్ ద్వారా ఆలయానికి అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతలకు అర్చకులు ఆశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన



దసరా ఉత్సవాలకు సంబంధించి క్యూలైన్లు, తదితరాలను ఆదివారం ఈవో కె.ఎస్.రామారావు, ఏడీసీపీ రామకృష్ణ, వన్‌టౌన్ పోలీసు అధికారులు పరిశీలించారు. ఈఈ లింగం రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడి కళావేదికపై కూచిపూడికి చెందిన శ్రీఅభినయ సత్య అకాడమీ కె.జ్యోతి ఆధ్వర్యంలో కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.



కృష్ణవేణి మాత విగ్రహం వద్ద ఆళ్ల గోపాల కృష్ణారావు, తదితరులు

నదులు మానవాళి మనుగడకు జీవనాడులు

» ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు

వన్‌టౌన్, సెప్టెంబరు 22 : నదులు మానవాళి మనుగడకు జీవనాడులని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వన్‌టౌన్ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణవేణి మాత విగ్రహానికి జలవనరుల శాఖ అధికారులు, సంఘాల నాయకులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, పెన్నా పెద్ద నదులు, ఏలేరు, చెయ్యేరు, పాపాగ్ని, స్వర్ణముఖి లాంటి చిన్న నదులను పరిరక్షించుకోవాల్సిన సామాజిక బాధ్యత మన అందరిది అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇటీవల శ్రీశైలం జలాశయం దగ్గర జలసిరికి హారతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో కృష్ణా సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీఆర్. కృష్ణారావు, బ్యారేజీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.దినేష్ రాఘవేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదంపై సీఎం వ్యాఖ్యలకు అనుచిత పోస్టు

» మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల గ్రూపులో చర్చ

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను రవాణా శాఖకు చెందిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు అనుచిత వ్యాఖ్యలతో ట్యాగ్ చేయటం వివాదాస్పదమైంది. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల గ్రూపులో ఈ అనుచిత వ్యాఖ్యల వ్యవహారం నడిచింది. లడ్డూ ప్రసాదంలో అపవిత్ర పదార్థాలు కలిశాయని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఎన్డీఏ కూటమి సమావేశంలో చంద్రబాబు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వీటికి సంబంధించిన వీడియోను సంజీవ్ కుమార్ అనే వ్యక్తి జతచేసి కొన్ని పాయింట్లతో ఎంవీఐ గ్రూపులో పోస్టు చేశారు. ఈ పోస్టుపై విజయవాడ ఏఎంవీఐగా పని చేస్తున్న ఉమామహేశ్వరరావు స్పందిస్తూ 'సొల్లు' అంటూ కామెంట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతంగా ఉండాల్సిన అధికారి ఈ రకంగా స్పందించటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.



ట్రోఫీల ప్రదానోత్సవంలో ఆర్ఐవో సీఎస్ఎస్ఎన్ రెడ్డి, రవికాంత

ఎస్‌జీఎఫ్ అండర్-19 విజేతలు కృష్ణా, తూర్పు

» జాతీయ పోటీలకు ఏపీ జట్టు ఎంపిక పూర్తి

విజయవాడ స్పోర్ట్సు : నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్-19 టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో బాలికల విభాగంలో కృష్ణా, బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో బాలుర ఫైనల్స్‌లో పవన్ సత్య(కృష్ణా) నమాన్ జైన్(తూర్పు)పై 11-5, 11-8తో వరుస సెట్లతో విజయభేరి మోగించాడు. బాలికల ఫైనల్స్‌లో డి.దీక్షిత(విశాఖ), పి సంహిత(కృష్ణా)పై 11-8, 8-11, 11-6తో విజయం సాధించి టైటిల్‌ను కైవశం చేసుకున్నారు. జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, డీఈఐవో సాల్మన్‌రాజు, జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ వి.రవికాంత ట్రోఫీలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి ప్రతిభ చూపిన బాలబాలికలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్టు పరిశీలకులు దుర్గాప్రసాద్ ప్రకటించారు. ఈ జట్లు అక్టోబర్ 5 నుంచి 8వ వరకు లడక్‌లోని లేహ్‌లో జరిగే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాయి.

ఏపీ జట్టు : పి సత(కృష్ణా), నమాన్ జైన్, బి.సాయి జోషిత్, ఎల్ సాకేత్, ఎస్.కార్తికేయ(తూర్పుగోదావరి), ఎం.కౌశిక్(వైజాగ్), పి.రఫీ(గుంటూరు), సీహెచ్ వీరాంజనేయులు(గుంటూరు), బాలికలు : డి.దీక్షిత(విశాఖ), పి.సంహిత, ఎం.తన్వి, కె.వసుధ(కృష్ణా), పి.హాసిని(గుంటూరు), పి.భవిత(విశాఖ), పి.అక్షయ(కృష్ణా), ఎం.గ్రేష్మ శ్రీ(తూర్పుగోదావరి)లు ఎంపికయ్యారు.

విపత్తుల కట్టడిపై ప్రత్యేక దృష్టి

» జిల్లాలో డ్రెయిన్ల నెట్‌వర్క్‌పై కసరత్తు
» సర్వే నెంబర్ల ఆధారంగా వివరాలు
» బుడమేరు ఆక్రమణలో 3వేల గృహాలు, 80 నిర్మాణాల గుర్తింపు
» ఎవరికీ ఇబ్బంది లేకుండా 'ఆపరేషన్ బుడమేరు'
» వరద ముంపు బాధితులందరికీ న్యాయం
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి



వరద ముంపు బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 22 : ఇటీవల విజయవాడలో సంభవించిన బుడమేరు వరద ముంపు అధికశాతం ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని, ఇకపై ఇటువంటి విపత్తులను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఈ క్రమంలో డ్రెయిన్ల నెట్‌వర్క్‌పై కసరత్తు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడారు. వరద ప్రభావిత ప్రజలను ఆదుకోవటంలో ముఖ్యమంత్రి మార్గనిర్దేశంతో జిల్లా యంత్రాంగం విశేష కృషి చేసిందన్నారు. అర్బన్ పరిధిలో 32 వార్డులు, 179 సచివాలయాల పరిధిలో ఎన్యూమరేషన్ చేశారని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారిని కూడా జాబితాలో చేర్చుతున్నట్లు తెలిపారు. నష్ట పరిహార చెల్లింపులు పూర్తయిన తరువాత డ్రెయిన్ల నెట్‌వర్క్‌పై దృష్టి సారిస్తామని తెలిపారు. సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు. అవుట్‌ఫాల్స్ డ్రెయిన్లపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. 'ఆపరేషన్ బుడమేరు'లో ఆక్రమణలను గుర్తించి ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్, నీటిపారుదల శాఖ, విజయవాడ సిటీ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు, సంయుక్తంగా బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించి సర్వే నెంబర్ల వారీగా ఆక్రమణ వివరాలను నమోదు చేశామన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు నుంచి విజయవాడ వరకు 40 గ్రామాల పరిధిలో దాదాపు 2,700 ఎకరాల్లో బుడమేరు ప్రవహిస్తుందన్నారు. దాదాపు 270 ఎకరాల బుడమేరు ప్రాంతం పంట పొలాలుగా ఆక్రమణలకు గురైనట్టు గుర్తించామన్నారు. దీంతో పాటు 3 వేల గృహాలు, 80 నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. ఆక్రమణలన్నింటినీ పూర్తిగా పరిశీలించి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం 'ఆపరేషన్ బుడమేరు'ను చేపట్టనున్నట్టు తెలిపారు.

ముంపు బాధితులందరికీ న్యాయం

వరద ముంపు ప్రాంతాల్లో నష్టపోయిన ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఈమేరకు చర్యలు తీసుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. విజయవాడలోని 32 వార్డుల్లో, 179 సచివాలయాల పరిధిలో ఎన్యూమరేషన్ పూర్తిచేశామని, ఇంకా ఎవరైనా మిగిలిపోయినట్టయితే వారిని కూడా జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె వెల్లడించారు. ఆదివారం సింగ్‌నగర్, 259 వార్డు సచివాలయాన్ని, రాజరాజేశ్వరిపేటలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులతో ఆమె మాట్లాడుతూ, సర్వే ప్రకారం లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించామని, ఇంకా ఎవరి పేరు అయినా మిగిలిపోయినట్టయితే వారి వివరాలను కూడా యాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. చాలా మంది బాధితులు తమ పేర్లు ఉన్నాయో లేవోనని సచివాలయాలకు వస్తున్నారని, ఎవరూ ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. చివరి కుటుంబానికీ పరిహారం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. మ్యాపింగ్ జరగకపోయినా, నివాసం ఉంటున్నట్లు ఏదైనా ఆధారం చూపినా కూడా వివరాలు నమోదు చేస్తామన్నారు. నోటి మాటగా ఇక్కడ ఉంటున్నాం, అక్కడ ఉంటున్నాం అంటే సరిపోదని స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రానికి ప్రక్రియ పూర్తవుతుందని, ఈనెల 25న బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.



న్యూ ఆర్ఆర్ పేట సచివాలయంలో బాధితులు

సర్వం కోల్పోయాం.. ఆదుకోండి!

» సచివాలయాల వద్ద బాధితుల ఆందోళన

అజిత్‌సింగ్‌నగర్/పాయకాపురం : బుడమేరు ముంపు ప్రాంత బాధితుల నష్టపరిహారం జాబితా ఆదివారం విడుదలవడంతో లిస్టులో తమపేర్లు లేవని పలువురు సచివాలయాల వద్ద ఆందోళనకు దిగారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో బాధితులు ఆందోళనకు దిగారు. ఈనెల 1న నగర శివారున వేలాది కుటుంబాలు బుడమేరు ముంపు బారిన పడ్డాయి. ఇళ్లు, ఫర్నీచర్, వాహనాలు పూర్తిగా నీట మునిగి ఆర్థికంగా నష్టపోయారు. పదిరోజులుగా అధికారులు ఎన్యూమరేషన్ సర్వే చేపట్టి బాధితుల జాబితా తయారు చేశారు. అయితే వివిధ కారణాలతో వేలాది మంది బాధితుల పేర్లు లిస్టులో కనిపించలేదు. ఆదివారం సచివాలయాల్లో నష్ట పరిహారానికి అర్హులైన బాధితుల జాబితా సచివాలయాల్లో ఉంచారు. అయితే లిస్టులో తమ పేర్లు లేవని బాధితులు ఆదివారం ఆందోళనకు దిగారు. తాము వరదల్లో సర్వస్వం కోల్పోయామని, అయినా తమ పేరు ఎందుకు రాలేదని న్యూ రాజరాజేశ్వరిపేట, రాజీవ్‌నగర్‌తో పాటు పలు సచివాలయాల పరిధిలో సిబ్బందిని నిలదీశారు. వేలసంఖ్యలో బాధితులు సచివాలయాల వద్ద గుమిగూడటంతో వారిని శాంతిపజేయడానికి నానా ఇబ్బందులు పడ్డారు. సోమవారం జాబితాలో చేరుస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు.

ఔరా బెండ..!



కోడూరు : సహజంగా బెండ మొక్క మూడు నుంచి నాలుగు అడుగులు ఎత్తు ఎదిగి కాయలు కాస్తుంది. కానీ కోడూరు మండలంలోని లింగారెడ్డి పాలెంలో బెండ మొక్కలు 13 అడుగుల ఎత్తు ఎదిగి అబ్బురపరుస్తున్నాయి. చిట్టిప్రోలు వెంకట రామకృష్ణ తన మెట్ట భూమిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నాడు. పంట మధ్యలో రెండు బెండ మొక్కలు నాటగా, అవి 13 అడుగుల ఎత్తు ఎదిగి కాయలు కాస్తున్నాయి. చెట్ల కాడలు కూడా బలంగా ఉన్నాయి. వీటి పెరుగుదలకు ఏ విధమైన రసాయన ఎరువులు వినియోగించలేదని వెంకట రామకృష్ణ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై దశలవారీ ఉద్యమం : యూటీఎఫ్

గవర్నర్‌పేట, సెప్టెంబరు 22 : దీర్ఘకాలంగా పరిష్కారం కాని మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 26 నుంచి అక్టోబరు 24 వరకు దశల వారీ పోరాటాలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సంస్థ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అప్‌గ్రేడేషన్ జరగలేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, నేతలు కె.శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, కుసుమకుమారి, జి.లక్ష్మీరాజా, ఎస్‌పీ మనోహర్‌కుమార్, 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ఎస్ ప్రసాద్

9 మంది ఎంపీడీవోల బదిలీ

మచిలీపట్నం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఎంపీడీవోలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ విభాగం డైరెక్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎం.రమేష్‌బాబు,ఎస్.వి.రమణ, కె.శిల్పను గుంటూ రు జిల్లాకు, వి.ఎస్.నాగేశ్వరరావు, ఎం.శ్రీసాయి హర్షను విశాఖ పట్నం జిల్లాకు, ఎస్.ఎన్.ఉమామహేశ్వరరావు, వి.రెడ్డయ్యను పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీచేశారు.

నెల్లూరు డీఆర్‌డీఏ పీడీగా నాగరాజకుమారి

కృష్ణాజిల్లా డ్వామా విభాగంలో ఫైనాన్స్ మేనేజరుగా పనిచేస్తున్న వి.నాగరాజకుమారిని నెల్లూరు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎల్‌డీవోలు వీరే ..

ఎన్టీఆర్‌జిల్లా తిరువూరుకు మద్దిపట్ల శ్యామల, కృష్ణాజిల్లా ఉయ్యూరుకు ఎస్.రాజేష్, గుడివాడకు వి.సుజాతను నియమించారు. ఏలూరు డీఎల్‌డీవోగా పనిచేస్తున్న ఎబీపీవీ లక్ష్మిని మచిలీపట్నం డీఎల్‌డీవోగా నియమించారు. జి.పద్మను రాజమండ్రి డీఎల్‌డీవోగా బదిలీచేశారు.



పుస్తకావిష్కరణలో యార్లగడ్డ తదితరులు

మనసు కవి ఆత్రేయ

» రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ

విజయవాడ కల్చరల్/వన్‌టౌన్: ఆత్రేయ మనసు కవి అని, నాటకాల్లోనూ నటించారని పద్మభూషణ్ సత్కార గ్రహీత, విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆదివారం గాంధీనగర్ హోటల్ ఐలాపురంలో ఎక్స్‌రే సంస్థ ఆధ్వర్యంలో సినీ సాహిత్య పరిశోధకుడు పైడిపాల రచించిన 'అక్షరశిల్పి ఆత్రేయ' పుస్తకావిష్కరణ జరిగింది. కొల్లూరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, విశిష్ట అతిథిగా సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, పుస్తక స్వీకర్త ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, సీనియర్ జర్నలిస్టు రెంటాల జయదేవ్ హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆత్రేయ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన పుస్తకావిష్కరణ సభలో యార్లగడ్డ మాట్లాడుతూ, రాసి ప్రేక్షకులని, రాయకుండా నిర్మాతలని ఏడిపించే వాడే ఆత్రేయ అని అన్నారు. ఆయన వందలాది పాటలు రాశారని, ఆ చిత్రాలన్నీ విజయవంతమయ్యాయని చెప్పారు. ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఆత్రేయ గొప్ప కవి అని, ఆయన జీవిత చరమాంకంలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డారని చివరి రోజుల్లో ఆయన రాసిన రచనలను నటుడు మోహన్ బాబు కొన్నారన్నారు. ప్రస్తుతం తాను చైనా నటుడు, త్రిపుల్ ఆర్ చిత్రంలో నటించిన హాలీవుడ్ హీరోయిన్, బాలీవుడ్, కోలీవుడ్ నటులతో 'సద్గురు ది నాలెడ్జి' అనే చిత్రం తీస్తున్నట్టు తెలిపారు. ఈ చిత్రంలో మనిషి 320 ఏళ్లు కూడా జీవించవచ్చు అనే అంశంతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఆత్రేయ పాటలను ఎంతగానో ఇష్టపడతానన్నారు. రెంటాల జయదేవ్ అక్షర శిల్పి ఆత్రేయ పుస్తకాన్ని విశ్లేషించారు. అనంతరం రచయిత డాక్టర్ పైడిపాలను ఘనంగా సన్మానించారు.

ఏపీ ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ గౌతమ్‌రెడ్డికి నిరసన సెగ

» అడ్డగించిన రాధా-రంగా మిత్రమండలి సభ్యులు
» రంగాకు క్షమాపణ చెప్పాలని డిమాండ్



రాధా-రంగా మిత్రమండలి సభ్యులను అరెస్టు చేస్తున్న పోలీసులు



వెళ్లిపోతున్న గౌతమ్‌రెడ్డి

గుడివాడ, సెప్టెంబరు 22 : ఏపీ ఫైబర్ నెట్ మాజీ చైర్మన్ గౌతమ్‌రెడ్డికి గుడివాడలో నిరసన సెగ తగిలింది. రంగాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గౌతమ్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ రాధా-రంగా మిత్రమండలి సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో సమావేశం నుంచి గౌతమ్‌రెడ్డి నిష్క్రమించారు. త్వరలో జరగనున్న కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై గుడివాడ నియోజకవర్గ వైసీపీ నేతలతో స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గౌతమ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న రాధా-రంగా మిత్రమండలి సభ్యులు అక్కడకు చేరుకుని ధర్నా నిర్వహించారు. గతంలో వంగవీటి రంగాను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన గౌతమ్‌రెడ్డిని క్షమాపణ చెప్పకుండా గుడివాడ విడిచి వెళ్లనిచ్చేది లేదని ధర్నాకు ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. రాధా-రంగా మిత్రమండలి సభ్యులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సొంత పూచికత్తుపై విడుదల చేశారు. మిత్రమండలి సభ్యుల ఆందోళనతో సమావేశాన్ని అర్ధంతరంగా ముగించుకుని గౌతమ్‌రెడ్డి వెళ్లిపోయారు.

100 రోజుల్లోనే బకాయిల చెల్లింపు సంతోషకరం

» కోర్టుల్లో పెండింగ్ కేసులను ఉపసంహరించాలి » ల్యాండ్ పూలింగ్‌పై అనుమానాలు నివృత్తి చేయాలి » ప్రభుత్వానికి అమరావతి జేఏసీ విజ్ఞప్తి

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే రాజధాని అమరావతి రైతులకు బకాయిలు చెల్లించడం సంతోషకరమని అమరావతి ఐక్య కార్యాచరణ సమితి నాయకులు అన్నారు. అమరావతి రైతులు, కౌలు రైతుల బకాయిలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణను కలిసిన వెంటనే 90 శాతం నిధులు విడుదల చేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం గుంటూరులో అమరావతి ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు మాదల శ్రీనివాస్ మాట్లాడారు. న్యాయపరమైన చిక్కుల నుంచి రైతులకు ఉపశమనం కలిగించాలని, అసైన్డ్ భూముల రైతుల సమస్యలపై ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అమరావతి తాగునీటి, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలపై శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి జీవధార కొండవీటి వాగు పునరుజ్జీవ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా రాజధాని పరిసర ప్రాంతాలకు తాగు, సాగు నీటి అవసరాలు తీర్చేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టులో అమరావతి రాజధానిపై పెండింగ్‌లో ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. అధికారులు గత ప్రభుత్వ నీడ నుంచి మారాలని, లేకుంటే రాజధాని అభివృద్ధి కుంటుపడుతుందని హితవు పలికారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల కల్పనపై నిర్దిష్ట కాల పరిమితి ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఆర్‌డీఏ కోసం అమరావతిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేసిన భవనం సిద్ధంగా ఉందని, దసరా పండగలోగా అందులోకి కార్యాలయాన్ని మార్చాలని కోరారు. ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూముల్లో ఆక్రమణలు, నిర్మాణాలు తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతి ఉద్యమంలో సహకరించిన వారికి అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్‌లో ప్రత్యేకంగా సన్మానం చేయాలని నిర్ణయించామని తెలిపారు.

ఐక్య కార్యాచరణ సమితి సభ్యుడు కళ్లం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ అమరావతి ఉద్యమంలో గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. ల్యాండ్ పూలింగ్‌పై రైతులకున్న అనుమానాలను నివృత్తి చేసి, మిగతా అవసరమైన భూములు తీసుకోవాలన్నారు. జీవో ఎంఎస్ నంబరు 41పై అసెంబ్లీలో తీర్మానం చేసి రైతులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. సీఆర్‌డీఏ నిబంధనలకు అనుగుణంగా డైనమిక్ ప్లాట్లు కేటాయింపు చేయాలని, భూములు ఆక్రమించిన వారిపై, అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని అభివృద్ధిపై రైతులతో, అమరావతి జేఏసీ సభ్యులతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్షలు నిర్వహించి పనులు ప్రారంభించాలని కోరారు. రాజధాని రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ధనేకుల రామారావు మాట్లాడుతూ గతంలో భూములు ఇవ్వని రైతులు సైతం ఇప్పుడు ముందుకు వస్తున్నారని, వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యూస్ బాక్స్

జిల్లా కాంగ్రెస్ నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు

విజయవాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ నేతలకు ఇతర జిల్లాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీచేశారు. వలిబోయిన గురునాథంను అనకాపల్లి ఇన్‌చార్జిగా నియమించారు. మేడా సురేశ్‌కు కాకినాడ జిల్లా, కొలనుకొండ శివాజీకి తూర్పుగోదావరి జిల్లా, వింతా సంజీవరెడ్డికి ఏలూరు జిల్లా, బైపూడి నాగేశ్వరరావుకు పశ్చిమగోదావరి జిల్లా, గంగిశెట్టి ఉమాశంకర్‌కు విజయనగరం జిల్లా, మార్నీడి శేఖర్‌కు కృష్ణాజిల్లా, మొవ్వా మోహనరావుకు ఎన్టీఆర్ జిల్లా, అంబటి రామకృష్ణ యాదవ్‌కు కర్నూలు జిల్లా బాధ్యతలను అప్పగించారు.

ప్రపంచ ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో

జానకిరామయ్యకు చోటు

ధర్నాచౌక్, సెప్టెంబరు 22 : మరణకారకమైన రోగాల నుంచి మానవాళిని తప్పించేందుకు జానకిరామయ్య పరిశోధనలు దోహదపడతాయని భువన విజయం కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడిశెట్టి శేషగిరి తెలిపారు. ప్రపంచ ఉత్తమ శాస్త్రవేత్తగా నాల్గవసారి ఎంపికైన కేఎల్‌యూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.జానకిరామయ్యను ఆదివారం ఘనంగా సత్కరించారు. గాంధీనగర్‌లోని భువన విజయం కళాకేంద్రం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కళాకేంద్రం, ప్రోగ్రెసివ్ సపాయ్ కర్మచారిస్ సంఘం, సైన్స్-వైజ్ఞానిక అభివృద్ధి సంఘం సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన ప్రపంచ ఉత్తమ శాస్త్రవేత్త జాబితాలో జానకిరామయ్యకు చోటు లభించింది. వివేకానంద యువజనసంఘం అధ్యక్షుడు చనుమోలు రామచంద్రరావు, ప్రోగ్రెసివ్ సపాయి కర్మచారిస్ సంఘం నేత కీర్తిప్రకాష్, సైన్స్-వైజ్ఞానిక అభివృద్ధి సంఘం సభ్యులు ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, కె.ధనయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

వన్‌టౌన్: కలెక్టరేట్ పింగళివెంకయ్య సమావేశమందిరంలో ఈనెల 23న సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్టు కలెక్టర్ సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వినతులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్‌లు,మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

క్రైం కార్నర్



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న సీపీ

ఫోన్లు దొరికాయ్

» 400 సెల్‌ఫోన్ల రికవరీ

విజయవాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : బాధితుల ఫిర్యాదులతో వివిధ ప్రదేశాల్లో చోరీ చేయపడిన, పోయిన 400 ఫోన్లను సైబర్ క్రైం పోలీసులు ట్రాక్ చేశారు. రూ.50లక్షల విలువగల ఫోన్లను సంబంధిత వ్యక్తులకు అందజేశారు. విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, డీసీపీ గౌతమి షాలి అందజేశారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్), చాట్‌బాట్ ద్వారా అందిన ఫిర్యాదులకు సంబంధించిన ఈ ఫోన్లను రికవరీ చేశారు. తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఫోన్లను ట్రాక్ చేశారు. ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో 1785 ఫోన్లను రికవరీ చేసి సంబంధిత వ్యక్తులకు అందజేసినట్టు పోలీసు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్లు గుణరాము, పలివెల శ్రీనివాసరావు, ఎస్ఐలు మూర్తి, రంభ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన 'కవర్'

ఆరోపణలకు తావులేకుండా, అవగాహన పెంపొందించేలా పోలీసులు ఒక కొత్త కవర్‌ను రూపొందించారు. రికవరీ చేసిన ఫోన్లను వాటిలో పెట్టి బాధితులకు అందజేస్తున్నారు. రికవరీ చేసిన ఫోన్లను సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇచ్చి ఆధార్, మొబైల్ బిల్లును చూసి ఇచ్చేవారు. ఈవిధంగా చేయడం వల్ల ఏదైనా ఫోన్ మిస్ అయితే ఆరోపణలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. రికరీ చేసిన ఫోన్లను పెట్టడానికి ఒక కవర్‌ను తయారు చేయించారు. దానిపై డీజీపీ, పోలీసు కమిషనర్ ఫొటోలతోపాటు రెండు క్యూఆర్ కోడ్‌లు ఉంటాయి. ఇందులో ఒక క్యూఆర్ కోడ్ స్కాన్‌ను చేస్తే ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్ వస్తుంది. ఇదే క్యూఆర్ కోడ్ సైబర్ క్రైం పోలీసుల వద్ద ఒకటి ఉంటుంది. దాన్ని పోలీసులు స్కాన్ చేస్తే ఫోన్‌కి సంబంధించిన వ్యక్తి వివరాలు తెలుస్తాయి. కవర్‌పై ఉండే మరో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సైబర్ నేరాల నియంత్రణపై అవగాహనకు రూపొందించిన సైబర్ సిటిజన్ యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, వాటి నుంచి ఎలా తప్పించుకోవాలి, మొబైల్ ఫోన్లు పోతే ఎలా ఫిర్యాదు చేయాలన్న సూచనలను ముద్రించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

రికార్డుల రారాజు మెగాస్టార్ చిరంజీవి : ముప్పా

కంకిపాడు, సెప్టెంబరు 22 : రికార్డుల రారాజు మెగాస్టార్ చిరంజీవి అని టీడీపీ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సినీ చరిత్రలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్ తరువాత ఆ స్థాయికి ఎదిగిన నాయకుడు చిరంజీవి అన్నారు. సినీరంగంలో చిరంజీవి, రాజకీయంగా పవన్ కళ్యాణ్ తమ సత్తా చాటుకున్నారన్నారు. గిన్నీస్ బుక్ రికార్డ్‌లో చిరంజీవికి స్థానం లభించటం భారతదేశ సినీ చరిత్రలోనే గొప్ప గుర్తింపు అన్నారు. ఈ సమావేశంలో చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్, పచ్చిపాల రాజా, బాయిన నాగరాజు, పచ్చిపాల శేఖర్, పిచుక రవి పాల్గొన్నారు.



ఉయ్యూరు గిరిజన కాలనీలో వినాయక నిమజ్జనంలో పాల్గొన్న వైవీబీ రాజేంద్రప్రసాద్

ఘనంగా వినాయక నిమజ్జనం

ఉయ్యూరు, సెప్టెంబరు 22 : సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన పండుగలు ప్రజల మధ్య ఐక్యత, తత్సంబంధాల పెంపునకు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక గిరిజన కాలనీలో ఆదివారం నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగర సాధికార సమితి నాయకుడు జంపన వీరశ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబాపురంలో దుప్పట్ల పంపిణీ



విజయవాడ రూరల్, సెప్టెంబరు 22 : బుడమేరు వరదల వలన సర్వస్వం కోల్పోయిన వరద బాధిత కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం అంబాపురంలో ఆదివారం జరిగింది. వట్టి సత్యనారాయణ సొంత నిధులతో 350 మంది వరద బాధిత కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వట్టి కృష్ణమోహన్, నాదెళ్ల శివకుమార్, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం!

- పొట్టిపాడు వద్ద శిథిలావస్థకు చేరిన ఏలూరు కాల్వపై వంతెన
- ఇరువైపులా విరిగిపోయిన రైలింగ్
- భయపెడుతున్న వంతెన మధ్యలో ఏర్పడిన రంధ్రం
- పట్టించుకోని ఆర్ అండ్ బీ అధికారులు
- బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు



పొట్టిపాడు-ఆనందపురం ప్రధాన రహదారిలో ధ్వంసమైన వంతెన.. ఇన్‌సెట్‌లో వంతెనపై రంధ్రం

ఉంగుటూరు, సెప్టెంబరు 22 : మండలంలోని పొట్టిపాడు-ఆనందపురం ప్రధాన రహదారిలో ఏలూరుకాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రధాన కాలువపై పెదఅవుటపల్లి, పొట్టిపాడు వద్ద ఎన్నో ఏళ్లక్రితం నిర్మించిన వంతెనలను ఆర్అండ్‌బీ, నీటి పారుదలశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి శిథిలస్థితికి చేరాయి. ముఖ్యంగా పొట్టిపాడు వంతెన దశాబ్దాల కాలంగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వంతెనకు ఇరువైపులా నిర్మించిన రెయిలింగ్‌లు సగం మేర విరిగిపోయి ధ్వంసమవడంతోపాటు వంతెన మధ్యలో ఏర్పడిన రంధ్రంవల్ల ఏక్షణం ఏప్రమాదం ముంచుకొస్తుందోనని పాదచారులు, వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. నిత్యం ఈ వంతెనపైనుంచి వందలాది వాహనాలు పొట్టిపాడు, ఆనందపురం, పొణుకుమాడు, ఉంగుటూరుకు రాకపోకలు సాగిస్తాయి. ప్రతిరోజూ వివిధవర్గాల ప్రజలు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు మండల కేంద్రమైన ఉంగుటూరుకు ఆటోలు, బైక్‌లపై ఈమార్గం గుండానే వెళ్లివస్తుంటారు. రాత్రివేళల్లో ఈ బ్రిడ్జిమీదుగా వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిందే. ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా వాహనంతో సహా కాలువలో పడిపోవాల్సిందేనని ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఇదిలావుండగా వంతెనకు రెండువైపులా నిర్మించిన కనెక్టివిటీ రోడ్డు భారీవర్షాలకు కోతకు గురై గుంతలమయం కావడంతో రైతులు, వ్యవసాయకూలీలు పొలంపనులకు బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. కాగా రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను ట్రాక్టర్లు, లారీలద్వారా ఈవంతెనపైనుంచి తరలించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఏలూరు కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెనలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి, ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

కేన్సర్ బాధితులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలి



కేన్సర్ బాధితులకు పండ్లు అందిస్తున్న వైద్యులు సీఎల్ వెంకట్రావు, పోలవరపు

పెనమలూరు, సెప్టెంబరు 22 : విజయవాడ రూట్స్ హెల్త్ ఫౌండేషన్, జైభరత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో కేన్సర్ రోజ్‌డే ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీఎల్ వెంకట్రావు మాట్లాడుతూ, కేన్సర్ బాధితులను రోగులు అనకూడదని, ఫైటర్స్ అనాలని పేర్కొన్నారు. రూట్స్ అధ్యక్షులు డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ మాట్లాడుతూ, కేన్సర్ బాధితులకు మానసిక ధైర్యాన్ని, భరోసా కల్పిస్తే వారు త్వరగా కోలుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో అన్నే శివనాగేశ్వరరావు, వైద్యు లు రాజేష్, విజయ్, క్రాంతి, పద్మజ, కన్వీనర్ మాధవి, షికినం శ్రీనివాస్, సుధారాణి, విజయలక్ష్మి, శివకృష్ణ, శిరీష, చందు శ్రీనివాస్, సంజయ్ చాజార్ పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమ ఫలాలు

ఇందుపల్లి, మానికొండ గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, సెప్టెంబరు 22 : రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ ప్రగతి దిశగా అడుగులు వేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం మండలంలోని ఇందుపల్లి, మానికొండ గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, తహసీల్దార్ జాలాది విమలకుమారి, నాయకులు ఇందుపల్లి యోహాను, కోలవెంటి నాగబాబు, రవి, నూతక్కి బెనర్జీ, చల్లగుళ్ల లక్ష్మణరావు, ఉయ్యూరు మురళి, ఎలమంచిలి దినేష్, చింతా వాసు, ఆరికట్ల రవికుమార్, బెజవాడ నాగేశ్వరరావు ఎడ్లపల్లి సాయిబాబు, అజీజ్, ఈడ్పుగంటి కృష్ణమూర్తి, పోతినేని రామకృష్ణ, తొమ్మండ్రు సుబ్రహ్మణ్యం, మూల్పూరి సాయికళ్యాణి, కూటమి నేతలు, పాల్గొన్నారు.



మానికొండ ప్రజావేదికలో మాట్లాడుతున్న యార్లగడ్డ

బొమ్ములూరులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు యువతకు బంగారు భవిష్యత్తు అందించడం చంద్రబాబునాయుడు సారథ్యంలోనే సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బొమ్ములూరులో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజా వేదిక సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, కొల్లి చందు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహనీయుడు ఎన్టీఆర్

గుణదల : తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడంలో విశేష కృషి చేసిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని ప్రసాదంపాడులో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యార్లగడ్డ వెంకట్రావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అటు సినీ రంగంలోనూ, ఇటు రాజకీయ రంగంలోనూ ఆయనకంటూ ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాజకీయాల్లో క్రమశిక్షణ నిజాయతీతో నడిచిన వ్యక్తి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం, ఉప సర్పంచ్ గూడవల్లి నరసయ్య, పార్టీ నాయకులు సర్నాల బాలాజీ, బొప్పన హరికృష్ణ, గుజ్జర్లపూడి బాబూరావు, ఎంపిటిసి అనిత, నెక్కలపూడి వెంకన్న, కొమ్మా నాగబూషణం, పొట్లూరి తాతయ్య, జ్యోతి, నందమూరి రవి, కిరణ్, దేవ భక్తుని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదంపాడులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే యార్లగడ్డ



రంగన్నగూడెంలో ..

● సుపరిపాలనతోపాటు సంక్షేమాభివృద్ధి చంద్రబాబునాయుడు సారథ్యంలోనే సాధ్యమని సర్పంచ్ కసుకుర్తి రంగామణి తెలిపారు. రంగన్నగూడెంలో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ.. ఇది మంచి ప్రభుత్వం.. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల గోపాలకృష్ణ, కసుకుర్తి అర్జునరావు, మందపాటి రాంబాబు, మొక్కపాటి సత్యన్నారాయణ, కృష్ణకిషోర్, కొలుసు గంగాజలం, కాట్రు సురేష్, ఉప్పులేటి సంధ్య, గంటా రామలక్ష్మి, కమలరత్నం, నజీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కంకిపాడులో ఇది మంచి ప్రభుత్వం

కంకిపాడు : కూటమి ప్రభుత్వం విజయాలతోపాటు జగన్‌రెడ్డి అరాచకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన అవసరముందని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కంకిపాడులో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొండా నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, బొర్రా వెంకట్, వణుకూరు విక్రం, ఏనుగ జయప్రకాష్, పచ్చిపాల రాజా, చలవాది రాజా, వడ్డాది శ్రీను, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు సాయిపురంలో..

ప్రజల మన్ననలు పొందుతున్న ప్రభుత్వం

ఉయ్యూరు : కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుందని సాయిపురం సర్పంచ్ షేక్ జాన్‌బాషా అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయిపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను గ్రామస్థులకు వివరించారు.

గన్నవరంలో..

గన్నవరం : కూటమి ప్రభుత్వం సమాంతర అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని సావరగూడెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. నాయకులు జూపల్లి సురేష్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, చిక్కవరపు నాగమణి, పటాపంచల శ్రీనివాసరావు, తలశిల రవికుమార్, పసుమర్తి అనిల్, జనసేన పార్టీ నాయకులు దినేష్, దేవరగట్ల ప్రసాద్, చిన్ని అర్జునరావు, సిరివెళ్ల వెంకట దుర్గ ప్రసాద్, చిన్ని కొండలరావు, చీమలదండు శివ రామకృష్ణ, షేక్ అబుల్యాజ్, బొర్రా ఓం సాయి, బడుగు గోపి పాల్గొన్నారు.



గన్నవరంలో..

కూటమి ప్రభుత్వం పనితీరు భేష్

● ఏపీ స్టేట్ ఎక్స్ సర్వీస్‌మన్ వెల్ఫేర్ అసోసియేషన్

పెనమలూరు, సెప్టెంబరు 22 : మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటుపై ఏపీ స్టేట్ ఎక్స్ సర్వీస్‌మన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మోటూరి శంకరరావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పోరంకిలోని ఏపీ మాజీ ఎక్స్ సర్వీస్‌మన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే మాజీ సైనికుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలోని ప్రభుత్వం అద్భుతమన్నారు. లక్షాపదివేల కుటుంబాల తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణ, సెక్రటరీ డాక్టర్ ఖలీల్, కేఆర్ శేషాద్రిరావు, ఎంసీకే రావు, రామారావు, రమేష్‌కుమార్, అన్నే రామారావు, లక్ష్మీనారాయణ, తిరుపతిరావు, రమేష్, బాలాజీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ శాంతి దినోత్సవం



శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఉయ్యూరు : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దినోత్సవం నిర్వహించారు. రవీంద్ర భారతి స్కూల్‌లో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, మాజీ అధ్యక్షుడు పొగిరి రాము హాజరై ప్రపంచ శాంతి ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. క్లబ్ సెక్రటరీ ఎన్.రాంబాబు, ట్రెజరర్ దినవహి ప్రసాద్, ప్రతినిధులు రావులపల్లి సుధాకర్, నల్లా శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాఘవరావు, రవీంద్రభారతి స్కూల్ ప్రిన్సిపాల్ మల్లీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవిశ్వశాంతి స్కూల్ ఉపాధ్యాయుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న హిందీ ఉపాధ్యాయుడు సుబ్బారావు

ఉయ్యూరు, సెప్టెంబరు 22 : శ్రీవిశ్వశాంతి స్కూల్ హిందీ ఉపాధ్యాయుడు జీవీ సుబ్బారావుకు మధుబన్ హిందీ అవార్డు లభించింది. హిందీ శిక్షక్ సమ్మాన్ సమారోహ్ కార్యక్రమంలో భాగంగా మధుబన్ పుస్తక ప్రచురణ కంపెనీ ఈ నెల 20న బెంగళూరులో భారతీయ విద్యాభవన్‌లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని పలువురు హిందీ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించగా అందులో సుబ్బారావు ఒకరుగా నిలిచారు. సుబ్బారావుతో పాటు ముగ్గురు విద్యార్థినులు ప్రతిక్షప్రియ, పి.వర్షిణి, సృష్టిసింగ్ అవార్డులకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని శ్రీవిశ్వశాంతి విద్యా సంస్థల చైర్మన్ మాదల సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. డైరెక్టర్లు సూర్యశేఖర్, సుష్మ, ప్రిన్సిపాల్ కాజ పద్మవాణి అవార్డు గ్రహీతలను అభినందించారు.

విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు: రాజా

కంకిపాడు, సెప్టెంబరు 22 : రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి కూటమి ప్రభుత్వంపై చేసిన వాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. వంద రోజులపాలనలో కూటమి ప్రభుత్వం ఏం చేయలేదని, ఇచ్చిన హామీలను అమలు చేయలేదంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. వరదల్లో కృష్ణా బ్యారేజీని కూల్చేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులే కుట్ర చేసారంటూ విమర్శించటం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను జగన్ సర్వనాశనం చేశారన్నారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు వైసీపీ ఓడించినా ఆ పార్టీ నాయకులకు ఇంకా సిగ్గు రాలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, షేక్ షకార్, పందిపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీ కొడుకుపై దాడి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 22 : కుటుంబ తగాదాల నేపథ్యంలో తల్లీకొడుకులపై దాడి చేసి గాయపరిచిన ముగ్గురిపై ఆదివారం జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి కొత్తపల్లి గ్రామంలో వంగల రాజేశ్వరికి, ఆమె తోడికోడలు వంగల బేబీల మధ్య కుటుంబ తగాదాలు పురస్కరించుకొని ఘర్షణ పడ్డారు. ఘర్షణలో బేబీ, ఆమె కుమారులు వంగల శివరామకృష్ణ, ప్రసాద్ కలసి రాజే శ్వరి, ఆమె కుమారుడు రాజేష్‌పై దాడి చేసి గాయపరిచారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హనుమాన్‌జంక్షన్ : స్థానిక గుడివాడ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాను మోలు గ్రామానికి చెందిన కాటుమాల కుమార్ తీవ్రంగా గాయ పడ్డాడు. కుమార్ జంక్షన్ నుంచి ద్విచక్ర వాహనంపై కాను మోలు వెళుతుండగా ఎదురుగా రాంగ్ రూట్‌లో మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. కుమార్‌కు తీవ్రగాయాలు కాగా విజ యవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

వంట పాత్రలు పంపిణీ

హనుమాన్‌జంక్షన్ : బుడమేరు వరద కారణంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం కండ్రిక ప్రాంతంలో వరద బాధితులకు ఆదివారం కమ్మవారి ఐక్య సేవా సమితి వంట పాత్రలు పంపిణీ చేసింది. సీఎం చంద్రబాబునాయుడు స్ఫూర్తితో కండ్రిక ప్రాంతంలో 200 కుటుంబాలకు వంట పాత్రలు పంపిణీ చేసినట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రామకృష్ణ తెలిపారు. సమితి నాయకులు పరుచూరి ప్రసాద్, పొట్లూరి సత్యప్రసాద్, పరుచూరి రాము పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడిగుడ్డు ధర (100)	

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

భక్తుల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు కట్టిపెట్టాలి : సింహాద్రి

అవనిగడ్డ : భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేయటం కూటమి నేతలు కట్టిపెట్టాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు అవనిగడ్డలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భక్తుల మనోభావాలు పరిగణలోకి తీసుకోకుండా చంద్రబాబు, కూటమి నేతలు తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో చేస్తున్న ప్రచారం ఆక్షేపణీయమన్నారు. అపచారం జరిగి ఉంటే విచారణ జరిపించి శిక్షించాలని గానీ, రాజకీయం కోసం శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీయటం సరికాదన్నారు. కడవకొల్లు నరసింహారావు, సింహాద్రి వెంకటేశ్వరరావు, చింతలపూడి లక్ష్మీనారాయణ, గాజుల జైగోపాల్, రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మొవ్వలో ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు



పులిగడ్డలో గుంజీలు తీసి నిరసన

కల్తీ నెయ్యి దోషులను కఠినంగా శిక్షించాలి

కూచిపూడి, సెప్టెంబరు 22 : లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి దోషులను కఠినంగా శిక్షించాలంటూ మొవ్వ గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. తాతినేని పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు, బొడ్డపాటి నాగరాణి, కాట్రగడ్డ శ్రీనివాసరావు, శీలం బాబురావు, తాతినేని రాణి, చలసాని వాణి కుమారి, తాతినేని శ్యామల, కాకర్ల రజని శ్రీ, కర్రా నాంచారయ్య, సంకుల కోటేశ్వరరావు, ఈడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** వైసీపీ పాలనలో జరిగిన ఘోర అపచారాన్ని వేంకటేశ్వరస్వామి క్షమించాలని కోరుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆలయ ప్రాంగణంలో మోకాళ్లపై కూర్చుని స్వామివారిని క్షమాపణలు వేడుకున్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు జి.వి.నగరాయులు, టీడీపీ నాయకులు బండే రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిష్టిబొమ్మ దహనం

మోపిదేవి : లడ్డూ ప్రసాదం అపవిత్రం చేశారనే ఆరోపణలతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను కూటమి నేతలు దహనం చేశారు. హిందువుల మనోభావాలు కాపాడాలి, బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, కూటమి పార్టీల నాయకులు రావి రత్నగిరి, రావి నాగేశ్వరరావు, దిడ్ల జానకి రాంబాబు, చందన రంగారావు, కోసూరు శివాజీ, జి.శివరామకృష్ణ, నాదెళ్ల శరత్ చంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.



భారీ అన్నసమారాధన

గుడివాడ : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు యక్కలి మణిదీప్ ఆధ్వర్యంలో బంటుమిల్లి రోడ్డులో గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. పవన్‌కుమార్, నాగరాజు, వెంకటరమణ, రామ్‌సుధీర్, వరదా బాలాజీ, అజయ్‌కుమార్, బాలకృష్ణ, మురళీ, పాల్వాది శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత



కాలేఖాన్‌పేటలో మాట్లాడుతున్న గోపీచంద్



చినకరగ్రహారంలో పథకాలు వివరిస్తున్న సత్యనారాయణ

ప్రజల అవసరాలు తీర్చే పాలన

పెడన , సెప్టెంబరు 22 : రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడన మార్కెట్ యార్డులో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ నిర్వహించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పయనింప చేస్తున్నారన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, కమిషనర్ ఎం. గోపాలరావు, కూటమి నాయకులు పంచకర్ల సురేష్, యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, పూలబాబు, హన్ను, బెజవాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్ :** సీఎం చంద్రబాబు తెగువ గల నేత అని సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. కాలేఖాన్‌పేటలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గోపీచంద్ మాట్లాడారు. ఎండి ఇలియాస్ బాషా, పిప్పళ్ళ కాంతారావు, దేవరపల్లి అనిత, సనకా నాగులు తదితరులు మాట్లాడారు. చంద్రబాబు రైతు పక్షపాతి అని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. చినకరగ్రహారం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బత్తిన నాగరాజు, పరసా వడ్డికాసులు, తోట భాస్కరరావు, నాగుల్‌మీరా, సంధ్యారాణి, కొనకళ్ళ నాగరాజు, పంచకర్ల శివాజీ, బొర్రా రాము పాల్గొన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఇది మంచి ప్రభుత్వం అని అంటున్నారని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో ఆదివారం ఇది మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. స్టిక్కర్లు అంటించారు. **తోట్లవల్లూరు :** అధికారం చేపట్టిన వంద రోజుల్లో భారీ వరదలతో పాటు అనేక క్లిష్టమైన సవాళ్లు ఎదురైనప్పటికీ సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన పథకాలను అమలు చేసి మంచి ప్రభుత్వం అని పేరు తీసుకువచ్చారని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీవో టి.స్వర్ణలత, తహసీల్దార్ కుసుమకుమారి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, తాడిశెట్టి నరేష్, ఎస్ కృష్ణసుమన్, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఐలూరు సర్పంచ్ పీరాటి సుజాత, రమణ, ఉప్పులూరి గోపాలకృష్ణ, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. **నాగాయలంక :** చోడవరంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం గురించి స్టిక్కర్లు, బ్రోచర్లు పంపిణీ చేసి వివరించారు. ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, పంచాయతీ కార్యదర్శి విజయకృష్ణ, కెబి.రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నాగాయలంక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నోడల్ అధికారి రామ్ లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసరావు, మండవ బాలవర్ధిరావు, కైతేపల్లి అంకాలు, తలశిల నాని పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



వరద బాధితులకు ఏఎన్ఎం విద్యార్థుల విరాళం రూ.1.50 లక్షలు

పామర్రు : వరద బాధితుల సహాయార్థం ఏఎన్ఎం విద్యార్థులు రూ.1,50,558 సేకరించి ప్రిన్సిపాల్ పూర్ణ చంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ పూర్ణ చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

వరద బాధితులకు వివిధ సంస్థల వితరణ

నందివాడ (పెదలింగాల) : బుడమేరు వరద బాధితుల సహాయార్థం గుడివాడ డాక్యుమెంట్ రైటప్ చంద్రాల హరి రాంబాబు ఆదివారం పెదలింగాల గ్రామంలో మాజీ సర్పంచ్ కలపాల నాగేశ్వరరావు, కలపాల వీరభద్రరావు ఆధ్వర్యంలో సుమారు 350 మందికి సుమారు 1.20 లక్షల తన సొంత నిధులతో నిత్యావసర సరుకులు అందజేసినట్లు రాంబాబు కుమారుడు దిలీప్ తెలిపారు. తుమ్మలపల్లి సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు. **మోపిదేవి :** కె.కొత్తపాలెంలో బాధితులకు ముదినేపల్లి మండలం కొర్రగుంటపాలెం ఇమ్మానియేలు ప్రార్థనా మందిరం, విజయవాడకు చెందిన వైష్ణవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 360 బాధిత కుటుంబాలకు సహాయాన్ని గ్రామసర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు పంపిణీ చేశారు. దైవసేవకులు స్పర్జన్ రాజు, విజయ్ కుమార్, వైష్ణవి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కాగిత రవికు మార్, శ్రీరామ శ్రీనివాస్, కోటేశ్వరమ్మ, లక్ష్మీనాయక్, టీడీపీ నాయకులు రావి రత్నగిరి, కొక్కిలిగడ్డ యోసోబు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** అవనిగడ్డ నియోజకవర్గ విద్యా కుటుంబం వరద బాధితుల కోసం సేకరించిన నగదుతో మండల పరిధిలోని పులిగడ్డ పల్లెపాలెం 350 కుటుంబాలకు, వసుమట్లలో120, రేగుల్లంక 170 వరద బాధిత కుటుంబాలకు వంటపాత్రలు, కుక్కర్లు, బకెట్లు పంపిణీ జరిగింది. ఎంఈవో ఏ.పిచ్చియ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతిదేవి, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పులిగడ్డ పిచ్చేశ్వరరావు, శేషుబాబు, జి.వి.ఎస్.పెరుమాళ్లు, వి.సాంబశివరావు, ఎంఈవోలు టి.వి.ఎం.రామదాసు, ఏ.రామారావు, వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్ అధ్యక్షులు డేవిడ్ శ్యామ్యూల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాత ఎడ్లంకలోని వరద బాధితులకు మరోసారి 15 కేజీల బియ్యం, పప్పు, మంచి నూనె, పప్పు దినుసులు, కూరగాయలు పంపిణీ చేశారు. పులిగడ్డ, ఎడ్లంక గ్రామంలోని 200 పల్లెకార కుటుంబాలకు, ఎదురుమొండి గ్రామంలో 150 కుటుంబాలకు ఒక్కొక్కరి రూ.1500 విలువ చేసే సహాయాన్ని అందజేశారు. మేనేజర్ తాడేపల్లి రాజా, కార్యదర్శి గాడేల్లి ఐజయ్య, సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, ఎడ్లంక చర్చి పాస్టర్ విలియమ్ కేరీ, సంఘస్థులు పాల్గొన్నారు.

పెడన ఇన్‌చార్జి ఎస్సైగా గణేష్‌కుమార్

పెడన : పెడన ఇన్‌చార్జి ఎస్సైగా బంటుమిల్లి ఎస్సై గణేష్‌కుమార్‌ను నియమించారు. పెడన ఎస్సై సత్యనారాయణ మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై గాయాల పాలయ్యాడు. ఆయన సెలవుపై స్వగ్రామం వెళ్లిపోయాడు. గణేష్‌కుమార్‌ను ఇన్‌చార్జి ఎస్సైగా నియమించారు.

మదర్సా విద్యార్థులకు దుస్తుల పంపిణీ

గుడివాడ : జష్నే మిలాదున్నబి సందర్భంగా ఆదివారం కార్మికనగర్‌లోని మస్జిద్-ఏ-మొహమ్మదీయ కమిటీ ఆధ్వర్యంలో మదర్సా మొహమ్మదీయ గౌసియా అరబిక్ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. మసీద్ కమిటీ సభ్యులు మొహమ్మద్ అలీ, అమీర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులను ఆదుకోవాలి

నాగాయలంక : అంబేద్కర్ కాలనీలో అగ్ని ప్రమాదం జరిగి మద్దూరి ధర్మయ్యకు చెందిన గొడ్ల చావిడి, గడ్డి వామి కాలిపోయాయి. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. జై భీమ్ రావ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్ తదితరులు బాధితులను పరామర్శించారు. బాధితుడిని ఆదుకోవాలని కోరారు.

పంట నష్టపోయాం..ఆదుకోండి

మోపిదేవి : కృష్ణానది వరదల కారణంగా పంట నష్టపోయి లక్షల రూపాయల్లో ఆర్థికంగా దెబ్బతిన్నామని, నమోదు చేసి పరిహారం వర్తింప చేయాలని కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన గ్రామ కంఠం భూమి సాగు చేసుకుంటున్న రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన 45 మంది రైతులు వారి పూర్వీకుల కాలం నుంచి భూమిని సాగు చేస్తున్నారు. 34 ఎకరాలకు పైగా భూమి మెట్ట పంటలు సాగు చేస్తుండగా, గతంలో ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో ప్రభుత్వం పంట నష్టం నమోదు చేసి పరిహారం సైతం అందించిందన్నారు. 2009 భారీ వరదల సమయంలోనూ నాటి ముఖ్యమంత్రిగా ఉన్న రోశయ్య పంట నష్టపరిహారం అందించగా, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ కంఠం భూములు నమోదు చేసి పరిహారం అందించలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా పంటలు దెబ్బతిన్న పొలాలకు పరిహారం అందించాలని కోరుతున్నారు. ఎకరానికి రూ. 1.50 లక్షలు పెట్టుబడి పెట్టి ఆర్థికంగా తీవ్ర నష్టాలు పాలయ్యామని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఇప్పటికే తహసీల్దార్, ఆర్డీవోల దృష్టికి గ్రామ కంఠం భూములను నమోదు చేసి పరిహారం అందించాలని కోరామన్నారు. తారతమ్యాలు లేకుండా ఆర్థికంగా అన్ని విధాలా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



దెబ్బతిన్న అరటి తోటలో రైతులు

దెబ్బతిన్న పసుపు పంట చూపుతున్న రైతులు

రిజిస్ట్రేషన్ కూడా చేశాం



మా కుటుంబానికి పూర్వీకుల నుంచి 76 సెంట్ల భూమి రాగా, సాగు చేస్తున్నాం. భూమి రిజిస్ట్రేషన్ కూడా చేయటం జరిగింది. లక్ష రూపాయల పెట్టుబడి పెట్టగా పూర్తిగా నష్టపోయాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- పడమట అంకినీడు ప్రసాద్

పూర్తిగా దెబ్బతిన్నాం



దశాబ్దాల తరబడి గ్రామ కంఠం భూమే జీవనాధారంగా జీవిస్తున్నాం. పంట దెబ్బతినగా అధికారులు అంచనా వేయకపోవటం బాధ కలిగిస్తుంది. వేలాది రూపాయలు పంట వేసి పూర్తిగా నష్టపోయాం. ప్రభుత్వం గ్రామ కంఠం భూములను నమోదు చేసి ఆదుకోవాలి.

- పడమట వెంకటేశ్వరమ్మ

కోట సచ్చిదానంద శాస్త్రికి కళాకారుల నివాళి



మచిలీపట్నం టౌన్ : పద్మశ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి హరికథా గానం ఎంతో హృద్యంగా ఉండేదని ప్రముఖ హరికథకుడు మడమల రాంబాబు అన్నారు. తెలుగు బాషా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఈడేపల్లి ఆంజనేయ స్వామి కళావేదికపై పద్మశ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి సంస్మరణ సభ జరిగింది. పలువురు కళాకారులు, సాహితీవేత్తలు శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంబాబు మాట్లాడుతూ, మచిలీపట్నంతో కోట సచ్చిదానంద శాస్త్రికి ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, కోట సచ్చిదానంద శాస్త్రి విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలన్నారు. అప్పినీడి పోతురాజు, వెనిగళ్ళ వెంకట మహేశ్వరరావు, జమ్మలమడక శేషశేఖర్, లంకా రాజేష్, బి. నారాయణ మూర్తి, భవిష్య తదితరులు మాట్లాడారు.

రోటరీ ఆధ్వర్యంలో స్పెల్ బీ పోటీలు

గుడివాడ : రోటరీ యువజనోత్సవాల సందర్భంగా ఆదివారం విద్యార్థులకు క్లబ్ కార్యదర్శి జి.కిరణ్‌బాబు ఆధ్వర్యంలో స్పెల్ బీ పోటీలను నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతగా దోసపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు చార్లెస్ ఎలైజా వ్యవహరించారు. క్లబ్ కోశాధికారి ఎన్.ప్రసాద్, పూర్వాధ్యక్షుడు ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, బి.శంకరరావు, సభ్యులు నరేష్, మారుతీకుమార్, శంకర్, నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత ప్రాంతాల్లోని 25 పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



గుడివాడ : విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని 10 ఉన్నత పాఠశాలలు, 15 ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు మానవతా స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. సంస్థ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యవర్గ సమావేశం దండమూడి జయలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. కెరీర్ గైడెన్స్, రక్తనిధి ఏర్పాటు, 4500 మంది విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేయాలని తీర్మానించారు చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, కార్యదర్శి సీతాల ప్రసాద్, కోశాధికారి జె.వి.వి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా కెరీర్ గైడెన్స్ చైర్మన్ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, పలు మండలాల చైర్మన్‌లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు



నందివాడ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ ఆధ్వర్యంలో రుద్రపాక, పుట్టగుంట, రామాపురం హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఒక్కో శిబిరంలో 10 మంది డాక్టర్లు వైద్యసేవలందించినట్లు ప్రముఖ పిల్లల వైద్యులు మాగంటి శ్రీనివాసరావు తెలిపారు. వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశామన్నారు. డాక్టర్ పొట్లూరి వంశీ మాట్లాడుతూ శస్త్ర చికిత్స వంటి పెద్ద వైద్యాన్ని గుడివాడ హాస్పటల్‌లో సగం ధరలకే అందించడం జరుగుతుందన్నారు. ప్రముఖ వైద్యులు పి.జి.కృష్ణ, పినపాల రేణుకాదేవి, మాగంటి కృష్ణశ్రీ, రోహిణి, పొట్లూరి వినోద్, పిన్నమనేని ప్రశాంత్, పిన్నమనేని శశాంక్, మోపిదేవి అనుదీప్, సురేష్, సతీష్, రాధాకృష్ణ, రత్న ప్రసాద్, ఏసుపాదం, లక్ష్మణరావు, స్వామి, వెంకన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో వరద బాధిత రైతుల సదస్సు రేపు

తోట్లవల్లూరు : వరద బాధిత రైతులకు పరిహారం పెంపు కోసం ప్రభుత్వంపై వత్తిడి తీసుకు వచ్చేందుకు ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటలకు తోట్లవల్లూరులో వరద బాధిత రైతుల సదస్సు నిర్వహించనున్నట్టు జిల్లా కౌలురైతుల సంఘం అధ్యక్షుడు కె శివనాగేంద్రం తెలిపారు. తోట్లవల్లూరులో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. వరికి ఎకరాకు రూ25 వేలు, పసుపు, కంద తదితర వాణిజ్య పంటలకు ఎకరాకు రూ ఒక లక్ష చొప్పున పరిహారం ఇస్తేనే రైతులు కోలుకుంటారన్నారు. ముంపుతో పాడైన మోటార్లను ప్రభుత్వమే రిపేరు చేయించాలన్నారు. మినుము, మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాన్నారు. కరకట్ట వెంబడి గ్రామాల రైతులు, లంక రైతులు హాజరు కావాలని నాగేంద్రం కోరారు. జిల్లా కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి రంగారావు, ఉపాధ్యక్షురాలు శైలజ, మండల కౌలురైతు సంఘం అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు, రైతు సంఘం నాయకుడు కె కొండలబాబు పాల్గొన్నారు.

115 మందికి ఉచిత కంటి పరీక్షలు

నాగాయలంక : ఆదివారం శంకర కంటి ఆసుపత్రి పెద్ద కాకాని వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం మారుతీ విద్యానికేతన్ స్కూల్‌లో జరిగింది. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడుల జ్ఞాపకార్థం వైద్య శిబిరం నిర్వహించగా, కంటి వైద్యులు సుకృత, చేతన లక్ష్మీ 115 మందికి కంటి పరీక్షలు చేశారు. 90 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, తలశిల లీలా మనోహర్, క్యాంప్ ఇంచార్జ్ గంగాధర్, తలశిల రవి, జామిలా మస్తాన్, మత్తి శివ పాల్గొని పర్యవేక్షించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు

చల్లపల్లి : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహనరావు 55 మందికి పరీక్షలు నిర్వహించి 23 మందికి శుక్లముల ఆపరేషన్లు అవసరమని నిర్ణయించారు. వీరికి విజయవాడలోని అమరావతి హాస్పటల్‌లో ఆపరేషన్లు చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. కొల్లిపర విష్ణుతేజ జ్ఞాపకార్థం తండ్రి కొల్లిపర నరేంద్ర శిబిరానికి సహకారం అందించగా, వాసవీక్లబ్ ప్రతినిధులు వర దా రాజశేఖర్, దేసు జయలక్ష్మి, దింటకుర్తి జ్యోతి, మలిశెట్టి చెంచురాములు, జూపూడి కిరణ్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, నంబూరి కుసుమకుమారి శిబిరాన్ని పర్యవేక్షించి సేవలు అందించారు.

మాజీ సర్పంచ్ ప్రణీతకు ఎమ్మెల్యే కాగిత నివాళి



బంటుమిల్లి : అర్తమూరు గ్రామ మాజీ సర్పంచ్ భూపతి ప్రణీత అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం అర్తమూరు విచ్చేసి ఆమె భౌతికకాయానికి నివాళలర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పర్యాటకులకు మెరైన్ పోలీసుల సూచనలు

కోడూరు : హంసలదీవి బీచ్ వద్దకు వచ్చే పర్యాటకులు మెరైన్ పోలీసు వారి ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని పాలకాయితిప్ప మెరైన్ సీఐ సురేష్ రెడ్డి, ఎస్ఐ ఉజ్వల్ కుమార్ తెలిపారు. పర్యాటకులుసముద్ర స్నానాలు ఆచరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తీరం వెంబడి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తమ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోడూరు పోలీసు, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు

పెడన : ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ ఆధ్వర్యంలో శ్యామలాంబ తల్లి ఆలయంలో ఆదివారం నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. చేనేత ప్రముఖులు నున్న యల్లమందయ్య, మోక్షనందరావు జ్ఞాపకార్థం వారి వారసుడు రమేష్ నిత్యావసరాలు సమకూర్చారు. ఫెడరేషన్ నాయకులు పిచ్చుక ఫణికుమార్, కట్టా హేమసుందరరావు, ఆకురాతి జనార్దనర్, పేరిశెట్టి నాగరవి, బళ్ళ సాంబశివరావు, నున్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో రక్తదాన శిబిరం 27న

చల్లపల్లి : దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు వర్ధంతి సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్, గ్రామీణ యువజన వికాస సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు మోపిదేవిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. శిబిరం పోస్టర్‌ను శనివారం రాత్రి చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ టివిఎస్.బాలాజీ, జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్ కోశాధికారి కొండపల్లి రాంబాలాజీ, మోపిదేవి బ్రాంచ్ ఛైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, వైస్ ఛైర్మన్ రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, చల్లపల్లి, నాగాయలంక ఛైర్మ న్లు నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, భోగాది శివ విష్ణువర్ధన్, ఎండి.ఏకె.జిలానీ పాల్గొన్నారు.

అవనిగడ్డలో మెగా వైద్యశిబిరం 27న

అవనిగడ్డ : దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 27వ తేదీన అవనిగడ్డలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కోడూరు, దివిసీమ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్న సాయిబాబు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా మెగా వైద్యశిబిరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. గాంధీక్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, బాసు నాంచారయ్య నాయుడు, మర్రే గంగయ్య, కాగిత రామారావు, కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.